
RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్ దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 236 | ఆగస్టు 17, 2025 | వెల : రూ.3-00



వైభవోపేతంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు 4లో..

# సమన్వయంతో ముందుకు..

**- అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి - ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో ముఖ్యమంత్రి ఉదయం ఉన్నతాధికారులతో మాట్లాడారు. వాతావరణ శాఖ అందించిన సమాచారం మేరకు, 15 జిల్లాల్లో అధిక వర్షపాతం, మిగతా జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని తెలిపారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించామని, వారు కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. తాజా పరిస్థితులపై అధికారులతో మాట్లాడినప్పుడు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉంటూ, లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలన్నారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలని పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున నగర, పురపాలక, గ్రామ పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. వైద్యారోగ్య శాఖ తగినంత మందులు అందుబాటులో ఉంచుకోవాలని అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం చోటుచేసుకోకుండా జాగ్రత్తలు వహించాలని రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, పురపాలక, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని ఆదేశించారు.





# భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

**– కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వేద న్యూస్, నల్లబెల్లి :**

వచ్చే రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత శాఖల అధికారులతో కలసి నర్సంపేట డివిజన్లోని ఖానాపూర్ మండలంలోని అశోక్ నగర్ పాకాల చెరువు నుండి వచ్చే వరద నీటి లో లెవల్ కాజ్ వే ను, నల్లబెల్లి మండలంలోని లేంకాలపెల్లి గ్రామం వద్ద కాజ్ వే, నర్సంపేట నుండి చెన్నారావుపేట వెళ్లే రహదారిలో ముగ్దుంపుర వద్ద, నర్సంపేట లోని మాదన్నపేట వద్ద కాజ్ వేలను పరిశీలించారు. కాజ్ వే ల వద్ద ఏర్పాటుచేసిన బారికేడ్లను పరిశీలించి సమర్ధ నిర్వహణకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించి రెడ్ అలర్ట్ గా మారే సూచనలు ఉన్నాయని తెలిపిన నేపథ్యంలో అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

భారీ వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, చెరువులలో నీటిమట్టం ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో భారీ వర్షాలపై టామ్ టామ్ చేసి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులలో, లో లెవెల్ కాజ్వే లపై వరద మీరు ప్రవహిస్తున్నందున ప్రజలకు వెళ్లడానికి అనుమ తించవద్దని, చెరువులలో ప్రజలను, చేపలు పట్టే వారిని రైతులను, పశు కాపరులను సందర్శకులను అనుమతించవద్దని అన్నారు. ఇప్పటికే అన్ని శాఖల అధికారులు సిబ్బంది అత్యంత ఆప్రమత్తంగా ఉన్నారని, విపత్కర పరిస్థితి ఎదురైతే ఎస్ డి ఆర్ ఎఫ్, ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలు జిల్లాలో సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువల్ని దాటే ప్రయత్నం చేయకుండా హెచ్చరిక బోర్డులు, పోలీసుల నిఘా ఉంచుతూ ప్రజలకు తగు సూచనలు చేయాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, జిల్లా పరిషత్ సీఈఓ రామిరెడ్డి, ఆర్డిఓ ఉమారాణి డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, జిల్లా పంచాయతీ అధికారి కల్పన, తాహసిల్దారులు, ఎంపీడీవోలు, పోలీసు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ముగ్గురు దొంగల అరెస్టు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

స్థానిక బస్టాండ్‌లో ఓ మహిళ బ్యాగ్‌లో నుంచి 14 తులాల బంగారు నగలను దొంగిలించిన ముగ్గురు దొంగలను పోలీసులు 24 గంటల్లోనే అరెస్టు చేశారు. వారి నుంచి దొంగిలించబడిన బంగారాన్ని, ఐదు స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు పంపారు. ఈ వివరాలను సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ కె. కృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు.

ఆగస్టు 13న నిర్మల్ నివాసి పడాల స్రవంతి పెళ్లికి హాజరై తిరిగి వెళ్తుండగా, పాత బస్టాండ్ వద్ద బస్సు ఎక్కే సమయంలో ఆమె హ్యాండ్‌బ్యాగ్‌లోని బంగారు ఆభరణాలు ఉన్న ప్లాస్టిక్ బాక్స్ కనిపించకుండా పోయింది. ఇందులో సుమారు 14 తులాల బంగారం ఉందని ఆమె మరుసటి రోజు (ఆగస్టు 14) పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి, మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నిందితులు వల్లాపు ఆంజనేయులు (ఎ 1), సంకంబ్లె రాజేశ్వరి (ఎ 2), డొక్క బాలవ్వ (ఎ 3) లను సిసిటివి ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టి ముగ్గురు నిందితులను గుర్తించారు.

మిగతా 3వ పేజీలో..




# మువ్వ గోపాలుడికి జై

**- దేశవ్యాప్తంగా వైభవంగా కృష్ణాష్టమి**

**వేద న్యూస్, వరంగల్ కల్చరల్ :**

ఆధ్యాత్మికం, ఆనందం ఉత్సవం కలగలిసిన కృష్ణాష్టమి వేడుకలను దేశవ్యాప్తంగా వైభవంగా నిర్వహించుకున్నారు. శనివారం ఉదయం నుంచే ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉట్టి కొట్టే కార్యక్రమాలను చేపట్టారు. వరంగల్ ఆరోపల్లెలోని ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా ముగిశాయి. జగన్నాథ స్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. చిన్నారులను వారి తల్లిదండ్రులు చిన్ని కృష్ణులు గోపికమ్మల వేషధారణలో అలంకరించి.. వారిని చూసి మురిసిపోయారు. “రారా బుజ్జి.. చిన్ని.. మువ్వగోపాల.. ముకుంద ..మురారి.. గోకుల కృష్ణ” అంటూ పిలుస్తూ హాయిగా ఆనంద ఉత్సాహాలతో.. వేడుకలు చేసుకున్నారు.



# మాది పేదల ప్రభుత్వం




**- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ**

**వేద న్యూస్ హన్మకొండ:**

వరంగల్ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. శనివారం రాంనగర్ లోని తమ నివాసంలో ప్రజల నుండి వినతులను, విజ్ఞప్తులను స్వీకరించారు. ప్రజల సమస్యలను ఓపికగా వింటూ అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో మాట్లాడి వారి పరిష్కార్%శీ%చడం జరిగింది. వరంగల్ ప్రజలకు ఏ సమస్య ఉన్నా ఎవరి వద్దకు వెళ్ళి పైరవీ చేయవలసిన అవసరం లేదని , నిరభ్యంతరంగా తనను సంప్రదించవచ్చని తెలిపారు. మాదీ పేదల ప్రభుత్వమని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అనీ, తూర్పు నియోజకవర్గంలోనిఅన్ని వర్గాల ప్రజలందరికీ సమాన న్యాయం చేయడం తమ లక్ష్యమని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు భారీ వర్ష సూచన కారణంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ ఏదైనా ఘటనలు జరిగితే టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని, సంబంధిత అధికారులు స్పందించి తక్షణ సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలందరూ సురక్షితంగా క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు.

# జాతీయ జెండాకు అవమానం..!?

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కేంద్రంలో జాతీయ పతాకం ఆవిష్కరించి 24 గంటలు గడిచిన ఇంకా దించకపోవడంతో అలాగే ఉంది. వివరాల్లోకి వెళ్తే మండల కేంద్రంలోని శ్రీవాణి స్కూల్ లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆగస్టు 16వ తేదీన ఉదయం 8 గంటలకు కూడా ఇంకా జెండాను దించకపోవడంతో ఇదేంటని పౌరులు ఆందోళన చేస్తున్నారు. శనివారం కూడా కృష్ణాష్టమి సందర్భంగా సెలవు దినం కావడంతో, మమ్మల్ని ఎవరూ ఏమంటారు అని అహంకారంతో ప్రశ్నించిన వారిని సైతం బెదిరించినట్లు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. జాతీయ జెండాకు అవమానం కల్గించి, కనీసం ఎప్పుడూ దించాలి అనే అవగాహన లేని ఈ ప్రైవేట్ పాఠశాల యజమాని పై తక్షణమే చర్యలు తీసుకోవాలి, పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు. ఏది ఏమైనా విద్యాబుద్ధులు నేర్పే పాఠశాలలే ఇలా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎలా అంటూ మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు




3లో..

# భద్రకాళి దేవస్థానానికి బస్సు సర్వీసు ప్రారంభం

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



భద్రకాళీ అమ్మవారి ఆలయానికి రోజురోజుకు భారీగా భక్తులు వస్తుంటారు. కానీ బస్సు సౌకర్యం లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రకాళీ దేవస్థానానికి బస్సు సౌకర్యం కల్పించాలని దృఢసంకల్పంతో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ మురళీధర్ వరంగల్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కి దేవస్థానానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ఆర్టీసీ డిఎం చరణ్ సింగ్ శనివారం ఆలయ ఈవో రాముల సునీత ఆధ్వర్యంలో టీపీసీసీ కార్యదర్శి బత్తిని శ్రీనివాస్ చేతుల మీదుగా భద్రకాళి దేవస్థానానికి బస్సు సౌకర్యాన్ని ప్రారంభించారు. హనుమకొండ, వరంగల్ మరియు కాజీపేట నుండి దేవస్థానానికి ప్రతిరోజు 1(బీ) ద్వారా భక్తులు దేవస్థానానికి చేరుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఆలయ ప్రధాన అర్చకులు బండారి శేషు, చైర్మన్ బండారి శివ సుబ్రహ్మణ్యం, డైరెక్టర్ గాదె శ్రవణ్ రెడ్డి, మోతుక్కూరి మయూరి రాము, ఓరుగంటి పూర్ణ, గాండ్ల స్రవంతి, జారతి వెంకటేశ్వర్లు, తోనుపునూరి వీరన్న, పాలడుగుల ఆంజనేయులు, బింగి సతీష్, తొగురు క్రాంతి అనంతుల శ్రీనివాస్, నార్ల సుగుణమ్మ ఆలయ సూపరింటెండెంట్అద్దంకి విజయ్ కుమార్ ఆలయ సిబ్బంది మరియు ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవా ప్రశంసాపత్రం అందుకున్న స్వాతి

**వేద న్యూస్, హనుమకొండ :**



హన్మకొండ జిల్లా కలెక్టరేట్ లో రెవెన్యూ విభాగంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న చింతం స్వాతి, కలెక్టరేట్లోని రెవెన్యూ విభాగంలో ఉత్తమ ఉద్యోగినిగా సేవా ప్రశంసా పత్రం అందుకున్నారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా, రెవెన్యూ శాఖలోని వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ప్రశంసా పత్రంతో సత్కరించారు. ఈ సందర్భంగా హనుమకొండ కలెక్టరేట్ రెవెన్యూ విభాగంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న సిఎచ్ స్వాతి, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ చేతుల మీదుగా ప్రభుత్వ ఉత్తమ సేవా ప్రశంసాపత్రం అందుకున్నారు. ప్రశంసా పత్రం అందుకున్న స్వాతిని రెవెన్యూ అధికారులు, హనుమకొండ కలెక్టరేట్ సిబ్బంది, స్నేహితులు, బంధువులు అభినందనలు తెలిపారు.

# ఆర్థిక సాయం అందజేసిన మాజీ సర్పంచ్

**వేద న్యూస్ :ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్ గ్రామంలో రెండు రోజుల నుండి కురుస్తున్నా వర్షానికి నిరుపేద కుటుంబానికి చెందిన బెజ్జంకి బాబు ఇల్లు పూర్తిగా కూలిపోయింది. దీంతో ఈ విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ “బొల్లవేణి మంజుల రమేష్” కూలిపోయిన ఇంటి యజమాని బాబు దగ్గరికి వెళ్లి ఓదార్చారు. ఈ సంఘటనపై స్థానిక పంచాయతీ కార్యదర్శి తెలిపారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన బాబుకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ తో మాట్లాడి అన్ని విధాలుగా ఆదుకుంటామని, అదే విధంగా ఇందిరమ్మ ఇండ్లు వచ్చే విధంగా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఐదు వేల రూపాయల(5000) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తిరుపతి, దమ్మని లక్ష్మణ్ ,బోయిన రమేష్ ,బెజ్జంకి రమేష్ ,బెజ్జంకి తిరుపతి, దమ్మని బాబు, బెజ్జంకి చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**వేద న్యూస్, పెద్దపల్లి :**



పెద్దపల్లి జిల్లాలో శనివారం వ్యవసాయ మార్కెట్ నందు పోలీస్ శాఖ వారు ఈమధ్య విపరీతంగా సైబర్ నేరాలు జరుగుతున్న తరుణంలో ప్రజలుకు వాటి పై అవగాహన కోసం పలు సూచనలు చేసినారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాదుతూ.... సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని నివారించే చర్యలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అపరిచితుల వ్యక్తుల నుండి మీకు డబ్బులు వస్తాయని మెసేజ్లు కానీ ఫోన్లు వస్తే వారికి ఎలాంటి సంబంధించిన వివరాలు తెలుపవద్దని, అంతేకాకుండా వాట్సాప్ ద్వారా వచ్చే తెలియని లింకులు,యాప్స్ ను క్లిక్ చేయకూడదని బ్యాంక్ నుండి కాల్ చేస్తున్నామని చెబుతూ మీ మొబైల్ కి ఓటీపీ వచ్చిందని నమ్మబలికి ఆ ఓటిపి చెప్పమని మీ అకౌంట్ లోనే డబ్బులు కాజేస్తారు. కావున తెలియని వ్యక్తులకు ఎలాంటి బ్యాంకు వివరాలు గానీ సంబంధించిన వివరాలను గోప్యంగా ఉంచుకోవాలని ఎవరికీ చెప్పకూడదని అన్నారు. ఈమధ్య సైబర్ నేరగాళ్లు అకౌంట్లో డబ్బులు క్రెడిట్ అని మెసేజ్లు పంపించి అకౌంట్ లోని బ్యాంకు బ్యాలెన్స్ చూసుకోవాలని లింకులు కూడా పంపిస్తూ అకౌంట్ లోని డబ్బులను దోచేస్తున్నారని, కొత్త తరంగా డిజిటల్ మీడియాలో మనకు తెలిసిన వ్యక్తుల ఫోటోలు మార్ఫింగ్ చేసి మనల్ని నమ్మించి ఇలా కూడా డబ్బులను దోపిడీ చేస్తున్నారని అంతేకాకుండా చిన్న పిల్లలకు మొబైల్స్ ఇవ్వడం వల్ల వారికి తెలిసి తెలియక మొబైల్ లోని ఇతర యాప్స్ లింకులను క్లిక్ చేయడం వల్ల కూడా సమస్యలు ఏర్పడతాయని కావున చిన్న పిల్లలకి మొబైల్స్ ఇవ్వకపోవడం శ్రేయస్కరం అని చెప్పారు. సైబర్ నేరానికి గురైన భావన ఎదురైతే దగ్గరలోని పోలీస్ స్టేషన్లో వెంటనే ఫిర్యాదు చేయాలని పోలీస్ వారు తెలిపారు. ఈ కార్యక్రమం నందు ఏఎస్ఐ రామస్వామి, మహమ్మద్ గౌస్, కానిస్టేబుల్స్ చైతన్య, శ్రీలత, రాణా ప్రతాప్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రిజర్వేషన్ ప్రకటించే స్థానిక సంస్థల

# ఎన్నికలు నిర్వహించాలి

**వేద న్యూస్, వరంగల్ జిల్లా:**



రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించిన తరువాతనే స్థానిక స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ పెంచకుండానే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం మొగ్గు చూపు తున్నట్లు తెలుస్తున్నదని అదే జరిగితే బీసీలకు తీరని ద్రోహం చేయడమేనన్నారు. శాసనసభ, శాసనమండలిలలో బీసీ రిజర్వేషన్ పై బిల్లులను ఏకగ్రీవంగా అన్ని పార్టీలు ఆమోదించిన తర్వాత కేంద్రానికి పంపిన రాష్ట్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీల బీసీ సంఘాల ప్రతినిధులతో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమై ఒదన్నారు. రాష్ట్రంలోని బిజెపి శాసనసభ్యులు శాసనసభలో బిల్లులను బలపరిచి దానికి భిన్నంగా మాట మార్చడం దగుల్బాజీ తనమేనన్నారు. రాష్ట్రంలోని బిజెపి కేంద్ర మంత్రులు పార్లమెంటు సభ్యులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బిల్లులను రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్లో చేర్పించడానికి ప్రయత్నం చేయడం లేదంటే బీసీల ఎడల వారి చిత్తశుద్ధి ఏమిటో బహిర్గతమైందన్నారు. బిజెపి రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య ఆగస్టు 25వ తేదీన హైదరాబాదులో సత్యాగ్రహ దీక్ష చేస్తానని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ,ప్రధాని నరేంద్ర మోడీపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీలో చేస్తే బాగుంటుందన్నారు. బీసీలకు ద్రోహం చేసే రాజకీయ పార్టీలకు పుట్టగతులుండవని తగిన సమయములో గుణపాఠం తప్పదని వెంకట్రాములు హెచ్చరించారు.

# శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు


**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండల కేంద్రంలోని అతి పురాతనమైన ఆరు శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు దేవాలయ చైర్మన్ సామల బిక్షపతి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం దేవాలయం అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని శ్రీకృష్ణుని పంచలోహ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేసినారు. ఈ కార్యక్రమం దేవాలయ చైర్మన్ సామల బిక్షపతి, మాజీ సర్పంచ్ వలపదాసు చంద్రమౌళి, సామల శంకరయ్య, మామిడి సాయి ,కంబత్తుల ప్రకాష్, కోలగాని శ్రీనివాస్ ,మార్త సుమన్ ,బూర రామకృష్ణ ,భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రమంగా ప్రభుత్వ భూమి పట్టా చేసుకున్న వ్యక్తి అరెస్టు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టా చేసుకుని, ప్రభుత్వ పథకాల ద్వారా డబ్బులు పొందిన కేసులో సిరిసిల్ల పట్టణానికి చెందిన మేడుదుల మొండయ్యను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. సిరిసిల్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ కె.కృష్ణ ఈ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ కె.కృష్ణ మాట్లాడుతూ.సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్ద బోనాల శివారులో ఉన్న సర్వే నం. 155లోని 2 ఎకరాల భూమిని గతంలో రెవెన్యూ సిబ్బందిగా (వి ఆర్ ఎ) పనిచేసి, ప్రస్తుతం నీటిపారుదల శాఖలో లష్కర్‌గా పనిచేస్తున్న మేడుదుల మొండయ్య అక్రమంగా పట్టా చేసుకున్నాడు. అధికారులను తప్పుదోవ పట్టించి, ఆన్‌లైన్ రికార్డులలో తన పేరు నమోదు చేసుకుని పట్టాదారు పాస్‌బుక్‌ను పొందాడు. దీంతో ప్రభుత్వం చేపట్టిన భూసేకరణలో భాగంగా ఈ భూమికి సంబంధించి అతడికి పరిహారం కూడా లభించింది. అయితే, ఈ భూమి వాస్తవానికి ఒక మహిళకు చెందింది. ఆమె ఈ విషయంపై ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, కోర్టు ఆమెకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ సూచనల మేరకు సిరిసిల్ల తహసిల్దార్ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. మేడుదుల మొండయ్యను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

# దివ్యాంగుల పెట్రోల్ బంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**– కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట :**




దివ్యాంగుల పెట్రోల్ బంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని బై పాస్ రోడ్ లో ఉన్న డిస్టిక్ అడ్మినిస్ట్రేషన్ ఫిల్లింగ్ స్టేషన్ ను కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న దివ్యాంగుల తో మాట్లాడి, వారికి ఎదురవుతున్న సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మరింత ముందుకు తీసుకొని వెళ్లడానికి టర్నోవర్ పెంచడానికి అన్ని ప్రభుత్వ వాహనాలను ఇక్కడే డీజిల్ పెట్రోల్ పోయించుకోవాలని అందరికీ సూచించాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం ను ఆదేశించారు. అలాగే అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలు, వ్యక్తిగత వాహనాలు ఇక్కడ లభించే నాణ్యమైన, డీజిల్ పెట్రోల్ని తీసుకొని దివ్యాంగులకు ఆర్థిక పునరావాసంలో అందరూ భాగస్వాములు అవ్వాలని పిలుపు ఇచ్చారు. అలాగే ఇక్కడ ఉన్న పరిస్థితులను పరిశీలించి వ్యాపార దృక్పథంతో మరింత ముందుకు వెళ్లడానికి తగు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా సంక్షేమ అధికారిని కలెక్టర్ ఆదేశించారు.

**– అంగన్వాడీ కేంద్రం తనిఖీ.**

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ లోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు అందిస్తున్న సేవలు గురించి ఆరా తీశారు. ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం గురించి పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు.. లబ్ధిదారులకు నాణ్యమైన సేవలు అందించాలని జిల్లా సంక్షేమ అధికారిని కలెక్టర్ ఆదేశించారు.

# రైతులకు రాయితీ..



## - వ్యవసాయ యాంత్రీకరణ పథకం

**వేద న్యూస్,బోయినిపల్లి:**

వ్యవసాయ యాంత్రీకరణ పథకం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వము లు 60:40 వాటాల చొప్పున ఈ పథకమును అమలు చేస్తున్నారు. ఈ పథకం లో సుమారు 186 పనిముట్లు 15 లక్షల విలువైన బ్యాటరీ పంపులు, తైవాన్ పంపులు, ట్రాక్టర్ తో నడిచే పరికరాలు డిస్క్ హారో, నాగళ్ళు, రోటవేటర్లు, విత్తనాలు వేసే యంత్రం, పవర్ వీడర్, పవర్ టిల్లర్, బ్రష్ కట్టర్, గడ్డి చుట్టలు చుట్టే యంత్రం రాయితీ లో ఉన్నాయి. ఈ పథకం లో సన్న చిన్న కారు, మహిళా, ఎస్సి , ఎస్టి రైతులకు 50శాతం రాయితీ, మిగిలిన రైతులకు 40 శాతం రాయితీ కలదు.ఈ పథకం క్రింద లబ్ధి పొందాలనుకునే రైతులకు కనీసం 1 ఎకరం వ్యవసాయ భూమి ఉండాలి, మట్టి పరీక్ష పత్రం కలిగి ఉండాలి. ఈ పరికరాలు కావాలనుకునే రైతులు తమ ఆధార్ కార్డు, భూమి పాస్ బుక్, ట్రాక్టర్ పరికరాల కొరకు రాక్ అర్ సి, పాస్పోర్ట్ సైజ్ ఫోటో తో కూడిన దరఖాస్తు ఫారం తో మండల వ్యవసాయ అధికారి కార్యాలయం లో ఈ నెల18 నుండి 25 లోపు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ధరలలో లబ్ధి దారులను మండల కమిటీ అనగా మండల వ్యవసాయ అధికారి, మండల అభివృద్ధి అధికారి, తహసీల్దార్ కలిసి విధి విధానాలను అనుసరించి ఎంపిక చేయడం జరుగుతుంది. ఏమైనా సందేహాలుంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని పత్రిక ముఖంగా వ్యవసాయ అధికారి ప్రణీత తెలిపారు.

# అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**



భారీ వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దని,భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా పోలీస్ యంత్రంగాన్ని అప్రమత్తం చేయాడం జరిగిందని జిల్లా ఎస్పీ శనివారం ఒక ప్రకటనను విడుదల చేశారు. పోలీసు యంత్రాంగం, డి ఆర్ ఎఫ్ బృందం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలియజేసారు.ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే,స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కి ఫోన్ చేసి పోలీసు వారి సహాయం పొందగలరని,పోలీస్ వారి సూచనలను పాటిస్తూ సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.జిల్లా ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీస్ శాఖ పరంగా తగిన ఏర్పాట్లతో ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రజలు పోలీసు వారి సూచనలు సలహాలు పాటిస్తూ సహకరించాలన్నారు. ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందున వాగులు,కాలువలు,నదులు,రిజర్వాయర్లు,చెరువుల వద్దకు ఎవరువెళ్ళరాదు.జలాశయాలు,చెరువులు,వాగుల,ప్రాజెక్టు ల వద్దకు మత్స్యకారులు,ప్రజలు ఎవరు కూడా చేపల వేటకు వెళ్లకూడదు. రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలి,వర్షాలు పడేటప్పుడు విద్యుత్ స్తంభాలను గాని,వైర్లను గానీ చేతులతో తాకవద్దు.చెట్ల కింద,పాడైన భవనాలు కింద,శిధిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండరాదు. స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, విద్యుత్, ఆర్%డ%బి, వైద్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడైనా రోడ్ల పై వరద ఉధృతితో రోడ్లు తెగిపోయినా, ఉధృతంగా ప్రవహించినా అక్కడికి ఆ గ్రామ ప్రజలు వెళ్లకుండా, రెండు దిక్కులా ప్లాస్టిక్ కోన్స్,బారిగేడ్స్,హెచ్చరిక గల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. ప్రతి పోలీస్టేషన్ పరిధిలో ఉన్న చెరువులు, కుంటల అలుగుల దగ్గర, ప్రధాన రహదారులపై ప్రవహించే వాగులు, వంకల దగ్గర నీటి ప్రవాహం గురించి ముందస్తు సమాచారం తెలుసుకొని , ప్రత్యేక్షంగా వెళ్లి పర్యవేక్షించి పోలీసు అధికారులు, సిబ్బంది అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు.వరద నీటికి చెరువులు, కుంటలు నిండి చెరువు కట్టలు తెగి పోయే ప్రమాదం ఉంటుంది. కావున ప్రజలు అప్రమత్తం గా ఉండగలరు.

వాహనదారులు ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా ప్రయాణించండి. వర్షానికి రోడ్లు కొట్టుకుపోయి , గుంతలు ఏర్పడి అందులో నీరు నిల్వ ఉండి ఆ గుంతలు వాహనదారులకు కనిపించక ప్రమాదానికి గురి అయ్యి ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంది. కావున జాగ్రత్తగా, నెమ్మదిగా చూసుకొని ప్రయాణించండి. వర్షాలకు కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జి ల వద్ద నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయరాదు అని సూచించారు.

# ముగ్గురు దొంగల అరెస్టు

పట్టుబడిన నిందితులు గత కొన్ని నెలలుగా రద్దీగా ఉండే ప్రదేశాల్లో ఇలాంటి చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును వేగంగా పరిష్కరించిన పోలీస్ సిబ్బందిని ఇన్స్పెక్టర్ కృష్ణ అభినందించారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కృష్ణ ప్రజలకు కొన్ని ముఖ్యమైన సూచనలు తెలిపారు.. రద్దీగా ఉండే ప్రదేశాలకు వెళ్ళినప్పుడు మీ విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బయటకు వెళ్లేటప్పుడు ఇంటికి తాళం వేసి వెళ్తున్నట్లయితే, ఆ విషయాన్ని తప్పనిసరిగా పోలీసులకు తెలియజేయాలని, నేరాలను అరికట్టేందుకు ప్రతి ఇంటికి సిసిటివి కెమెరాలు, సెంట్రల్ లాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారా నేరాల నియంత్రణలో భాగస్వాములు కావాలని సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ కె. కృష్ణ కోరారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

వేద న్యూస్, వరంగల్ :

వరంగల్ లోని పోతన నగర్ లో గల భగవాన్ శ్రీ మురళి కృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీ కృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి , పలు రకాల పువ్వులతో ఆ వాసుదేవున్నీ అత్యంత రమణీయంగా అలంకరించి, 108రకాల నైవేద్యాలు సమర్పించారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించడం జరింగింది. "ఓం నమో భగవతే వాసుదేవాయా" అనే నామస్మరణతో ఆలయ ప్రాంగణం అంత మార్మోగింది.

# హిందూ పండుగలకు ఆంక్షలు పెట్టడం సరికాదు

## - పోలీసు యంత్రాంగం సహకరించాలి - బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



వరంగల్ నగరంలో వినాయక మండపాలను ఏర్పాటు చేయు భక్త మండలి ఏర్పాట్లలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా దిగ్విజయంగా నిర్వహించడం కోసం శనివారం వరంగల్ ఏసిపిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం గంట రవికుమార్ మాట్లాడుతూ చారిత్రాత్మక మన ఓరుగల్లు నగరంలో గత అనేక సంవత్సరాలుగా వినాయక చవితి పండుగను మత సామరస్యంతో విజయవంతంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఈ పండుగను యూత్ అసోసియేషన్లు , భక్తమండలి , కాలనీ సంఘాలు కమిటీలుగా ఏర్పడి వారి వారి ప్రాంతాలలోని ప్రధాన కూడలిలో మండపాలను ఏర్పాటు చేసి, నవరాత్రులు పూజలు చేసి మన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కావున వారి వారి ప్రాంతాలలో ఏర్పాటు చేసే మండపాలకు ఎటువంటి అసౌకర్యం ఆటంకాలు జరగకుండా తగిన వసతులు కల్పించి భక్తి భావంతో వినాయక చవితి నవరాత్రులు దిగ్విజయంగా జరుగుటకు అన్ని విధాల సహకరించాలని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా తరపున కోరడం జరిగిందన్నారు. వారితో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకుల రఘునారెడ్డి, గడల కుమార్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్, జిల్లా కిసాన్ మోర్చా జిల్లా బైరి నాగరాజు, జిల్లా కోశాధికారి కూచన క్రాంతి కుమార్, జిల్లా అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్, ప్రచార కార్యదర్శి బైరి శ్యాంసుదర్, జిల్లా నాయకులు పొట్టి శ్రీనివాస్ గుప్తా, ముంద్రాతి వెంకటేశ్వర్లు, కొంతం సంగీత్, సీతా నాగరాజు, వెనిశెట్టి రోహిత్, ధర్మపురి రామారావు, గబ్బేట ప్రవీణ్ పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**వేద న్యూస్,శాయంపేట:**



పద్మశాలి యువసేన ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని చౌరస్తాలో ,గాంధీ చౌక్ వద్ద శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా చిన్నికృష్ణులు, గోపికల వేషధారణలో చిన్నారులు పలువురుని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా యువసేన కార్యకర్తలు ఉట్లను ఏర్పాటు చేశారు. డి జె సౌండ్ల తో, బాణా సంచా కాలుస్తూ ఉత్సాహంగా యువకులు పాల్గొన్నారు. యువకులు పిరమిడ్ ఆకారంలో ఒకరిపై ఒకరు పోటీపడి రంగులు చల్లుకొని ఉత్సాహంగా ఉట్లను పగలగొట్టారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి యువసేన అధ్యక్షుడు వడ్డేపల్లి శ్రీనివాస్, మండల పద్మశాలి అధ్యక్షులు వంగరి సాంబయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు బాసని ప్రకాష్, యువజన నాయకుడు బాసని సాయి,నాయకులు భాసని మార్కండేయ, చిందం రవి, వలపదాసు చంద్రమౌళి, వనం దేవరాజు, కడారి చంద్రమౌళి, భాసని భాస్కర్, అఖిల్, తుమ్మ ప్రభాకర్, మామిడి రమేష్, పసునూటి తిరుపతి, కందగట్ల సంతోష్, మామిడి సాయి కృష్ణ , వల్పదాసు వెంకటరమణ, గొట్టిముక్కుల రంజిత్, మార్త సుమన్, యువకులు పాల్గొన్నారు.

## ఆవు దూడకు బారసాల నిర్వహించిన

# నరసయ్య దంపతులు

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రం చెందిన సుంకపాక తార, నరసయ్య,లకు ఉన్న ఆవు గత 21 రోజుల క్రితం దూడకు జన్మనివ్వగా శనివారం దంపతులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా బారసాల నిర్వహించారు. అలాగే కృష్ణాష్టమి పురస్కరించుకొని వారి మనవల్లు, మనవరాళ్ళు, కృష్ణుడు, గోపికమ్మ, వేషాలు వేసి కృష్ణాష్టమి, వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణాష్టమి, రోజు తమ ఆవు దూడ లకు బారసాల చేయడం సంతోషంగా ఉంది అన్నారు. అలాగే కుటుంబ సభ్యులతో కృష్ణాష్టమి వేడుకలు జరుపుకోవడం మరువలేని రోజు అని అన్నారు.

# 454 చోట్ల ఆర్ అండ్ బీ రోడ్లు దెబ్బతిన్నాయి

## - రోడ్ల డ్యామేజీపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష..

**వేదన్యూస్ డెస్క్:**



భారీ వర్షాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన రోడ్ల డ్యామేజీపై అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. వరద ప్రవాహాలకు రాష్ట్ర వ్యాప్తంగా 454 చోట్ల ఆర్ అండ్ బీ రోడ్లు దెబ్బతిన్నాయని తెలిపారు. 629 కిలో మీటర్ల రోడ్డు దెబ్బతిన్నట్లు అధికారులు నివేదిక ఇచ్చినట్లు చెప్పారు. రోడ్ల మరమ్మత్తులపై పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం వేసిన నాణ్యతా రహిత రోడ్ల వల్లే ఇలాంటి పరిస్థితులు ఏర్పాడ్డాయని ఆరోపించారు.

భారీ వర్షాల కారణంగా 22 చోట్ల రోడ్లు తెగిపోతే వెంటనే 4 చోట్ల తాత్కాలిక పునరుద్ధరణ చేసినట్లు మంత్రి వెంకట్ రెడ్డి చెప్పుకొచ్చారు. 171 చోట్లలో ఇంకా కాజ్ వే, కల్వర్టులు వద్ద వరద ప్రవాహం ఉన్నట్లు పేర్కొన్నారు. 108 రాకపోకలకు ఇబ్బంది ఉన్న ప్రాంతాలను గుర్తించినట్లు చెప్పారు. 71 చోట్ల క్లియర్ చేయగా.. మిగతా చోట్ల సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు వివరించారు. వాగుల వెంట 58 కి.మీ రోడ్డు కోతకు గురైందని, అందులో 378 మీటర్ల రోడ్డును ప్రభుత్వం మూసివేసిందని తెలిపారు. మొత్తంగా 147 చోట్లలో కాజ్ వే, మైనర్ బ్రిడ్జిలు, కల్వర్టులు తాత్కాలికంగా, శాశ్వతంగా పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అవసరమైతే తప్ప రావొద్దని మంత్రి సూచించారు.

